# పతనం దిక్కు పరుగు

రచయిత రాజారావు మెదడు చెడిపోయిన రేడియోలా అయి పోయింది. ఒకేసారి జుమ్మని స్పీకర్ లోకి చొచ్చుకొస్తున్న రకరకాల అయిదారు స్టేషన్ల చానల్స్‌లా రకరకాల ఆలోచనలు ప్రవాహాల్లా సుడి తిరిగి అతని మనసు పిల్లలు కొట్లాడుకుంటున్న గదిలా తయారైంది.

'ఇప్పుడేం చేయాలి తను' అన్న ప్రశ్నను ఆయుర్వేద మాత్రలా మింగి ఏం చేయాలో తోచక నీళ్ళలో ఒంటిని తడుపుకుని ఒక్క ఉదుటున ఈకలను విదిలించుకున్న కోడిలా తలను విదిలించుకున్నాడు.

జేబులో ఉన్న ఉత్తరం గుప్పిట్లో దాచుకున్న మంచు ముక్కలా గిలిగింతలు పెడుతూంది గమ్మత్తుగా.

ఏదో ఆత్రత. ఏదో తహ తహ. ఏదో ఆరాటం. అయస్కాంత క్షేత్రంలో చిక్కుకున్న ఇనుపముక్కలా అతని మనసు జేబులో ఉన్న కాగితం ముక్క ప్రభావంలోకి లొంగి పోతూంది.

'కాని తను....' ఏదో అనుమానం చటుక్కున తెగిన చుక్కలా గుండెల్లో రాలి గాలి పోయిన రబ్బరు బుడగలా ముడుచుకుపోయి... అతను తన గొంతును తానే పిసుక్కుంటున్నట్టు విలవిల్లాడిపోయాడు.

గదిలో ఆటూ ఇటూ పచార్లు చేస్తున్నవాడల్లా చటుక్కున ఆగి నోట్లో సిగరెట్టుని అవతలకు విసిరేసి ఇంకోటి వెలిగించి పొగను శరీర మంతా నిండిపోయేలా కసిగా నోటి నిండా పీల్చి పారేసి గబగబా జేబులో నుండి మడిచిన ఉత్తరాన్ని తీసి విప్పాడు.

"శ్రీ రాజారావుగారికి,

నమస్కారం,

ముందుగా నన్ను నేను పరిచయం చేసుకోవడం ఎంతో అవసరం ఇప్పుడు. ఎందుకంటే ఇప్పుడు మన నడుమ ఒక ముఖ్యమైన సమస్య ఉంది. అయితే ఇంతవరకు నే నెవరో మీకు కానీ, మీ రెవరో నాకు కానీ తెలియదు. ఇప్పుడు తెలియాలి.

నా పేరు డాక్టర్ నరసింహం. నేను హైద్రాబాద్ నివాసిని. మొన్న నేను మద్రాస్ ఎక్స్‌ప్రెస్‌లో విజయవాడ నుండి హైద్రాబాద్ దాకా ప్రయాణం చేశాను. రైలు సికింద్రాబాద్ చేరగానే దిగి ఇంటికి పోదామని లేచాను. కాని కంపార్టుమెంట్ నిండా జనం రద్దీగా ఉండడం వల్ల ఆ తొక్కిసలాటలో పోవడ మెందుకని, ఒక క్షణం ఆగి నెమ్మదిగా పోదామని కూర్చున్నాను కాసేపు. దాదాపు అందరూ దిగిపోయారు. నేనొక్కడినే మిగిలిపోయాను. ఇక నేనుకూడా వెళ్ళిపోదామని నా సూట్‌కేసును తీసుకుంటూండగా నా దాని పక్క ఇంకో సూట్‌కేస్ కనిపించింది. అది ఎవరిదై ఉంటుందా అని కంపార్టుమెంట్‌లో చుట్టు పక్కలంతా చూశాను. ఎవరూ కనిపించ లేదు. అసలు పాసింజర్లెవరూ మిగిలిలేరిక. ఎవరైనా వస్తారేమో నని ఇంకాసేపు ఎదురు చూశాను. పదినిమిషాలుగడిచినా ఎవరూ రాలేదు.

ఆ క్షణాన ఏం చేయాలో పాలుపోలేదు. సూట్‌కేసును తీసుకుని దిగి ప్లాట్‌ఫాంపై నా ముందర పెట్టుకుని నిలబడ్డాను ఒక పావు గంట సేపు. మరిచిపోయిన వాళ్ళు దాన్ని చూచయినా తనదగ్గరి కొచ్చి అడిగి

తీసుకెళ్తారని అనుకున్నాను. ఆ విధంగాకూడా నిరాశ ఎదురైంది. ఎవరూ రాలేదు సూట్ కేస్ నాదని.

దాన్ని స్టేషన్ మాస్టర్‌కు హాండోవర్ చేద్దామనుకున్నాను. కాని వెంటనే నాకో ఆలోచన వచ్చింది. సూట్ కేస్‌ను తెరిచి దానిలో దాని వోనర్ తాలూకు వివరాలేవైనా ఉంటే, ఒకవేళ ఆ వ్యక్తి హైదరాబాద్ వాడే అయి ఉంటే వ్యక్తిగతంగా నేనే వెళ్ళి అందజేద్దామనిపించింది. ఆ ఉద్దేశ్యంతోనే సూట్ కేస్‌ను తెరిచి చూశాను. లోపల రెండు జతల బట్టలూ, వాటి నడుమ ఒక కాగితం పాకెట్టూ కనిపించాయి. పాకెట్టు విప్పి చూచినప్పుడు నా ఒళ్ళు ఝల్లుమంది. అన్నీ నోట్లే. రెండు కొత్త పది రూపాయల నోట్ల కట్టలు—ఆ క్షణంలో నా కనిపించిదేమంటే, సూట్ కేస్‌ను ఏ పోలీస్ కిచ్చినా అది సురక్షితంగా ఆ డబ్బు యొక్క యజమానికి చేరదని. చక్కగా ఇంటి కొచ్చి లోపల వెదికాను. మూతకు లోపలివైపున కుట్టి ఉన్న బట్ట సంచీలో మీ అడ్రసున్న కాగితం కనిపించింది. రాజారావు ... రచయిత .... కాశీబుగ్గ .... వరంగల్ ...మీ ఇంటి నంబర్ వగైరా అన్నీ రాసి ఉన్నాయి. ఆ అడ్రస్‌తోనే మీ కీ ఉత్తరం రాస్తున్నాను. బహుశా మీ కీ ఉత్తరం చేరేలోగా రెండు రోజుల నుండి మీరు పోయిన మీ సూట్ కేస్ గురించీ, డబ్బు గురించీ ఎంతో ఆందోళన చెంది ఉంటారు. ఎంతో బాధపడి ఉంటారు.

నా ఉత్తరం మీకు ఊరటనూ, మనశ్శాంతినీ కలిగిస్తుందని నా ఆకాంక్ష. మీరు వెంటనే ఉదయం పది గంటల లోపు మా ఇంటికి రాగలరు. నేను మీ కోసం ఎదురు చూస్తుంటాను. పది గంటలు దాటితే నేను హాస్పిటల్‌కు వెళ్ళిపోతాను. మీరు సరిగ్గా పది గంటలకు నా దగ్గరుండాలి. మీ సూట్ కేస్‌నూ, డబ్బునూ నేనే స్వయంగా మీ కందజేయాలని ఆరాట పడుతున్నాను.

క్రింద నా ఇంటి అడ్రస్ ఇస్తున్నాను. మీ రాక కోసం ఎదురు చూస్తూ...అభినందనలతో....

భవదీయుడు,

—డాక్టర్ నరసింహం."

లక్ష రూపాయ లొచ్చిన లాటరీ టిక్కెట్టులా ఆ ఉత్తరాన్ని భద్రంగా మడచి జేబులో పెట్టుకున్నాడు రాజారావు.

రెండు వేల రూపాయలు...అంటే రెండు వందల పది రూపాయల నోట్లు...

అతని కళ్ళలో నోట్లు నెమలిపింఛంలా విచ్చుకుని వికసిస్తున్నాయి.

డాక్టర్ నరసింహం ఆ క్షణంలో ఒకసారి దేవుడులా...మరు క్షణం మహా మూర్ఖుడిలా కనిపించాడు రాజారావుకి.

రెండు వేల రూపాయలను .... అందులో తేరగా దొరికిన వాటిని,...తిరిగి ఇచ్చేవాడు (పోగొట్టుకునేవాడు) ఈ రోజుల్లో మూర్ఖుడు గాక మరేమౌతాడు?

మొత్తానికి హైద్రాబాద్ వెళ్ళాలి. వెళ్ళి...దైవ (మూర్ఖ) స్వరూపుడైన డాక్టర్‌ను చూచి రూపాయలను తీసుకుని. రాజారావు కొత్త ట్యూబ్ లైట్‌లా వెలిగిపోయాడు సంతోషంతో. సంబరంతో భార్యను కేకేసి విషయాన్ని చెప్పి అప్పుడే మిఠాయి పొట్లం దొరికిన పసివాడిలా కేరింతలుకొట్టాడు. అతనికి రెక్కలు కట్టుకుని గాలిలో తేలిపోతున్నట్టు హాయిగా ఉంది

x x x

రాజారావు వీథిలో నిలబడి డాక్టర్ నరసింహం ఇంటిని పరిశీలనగా చూశాడు. బంగళా ఆశ్రమంలా ప్రశాంతంగా ఉంది. ముందర గేట్ పైన "డాక్టర్ నరసింహం, సైకాలజిస్టు" అన్న బోర్డు ఉంది.

గేట్ తెరుచుకుంటూండగానే లోపలినుండి కుక్క విడిచినబాణంలా ఉరికొచ్చింది. అతను ఎదురుగా సింహాన్ని చూసినట్టు హడలిపోయి... కుక్క మహా సంతోషంగా మొరుగుతూ—వాకిట్లో గందరగోళం తయారైంది.

అంతలో లోపలి నుండి ఒక తెల్లని బట్టతల మనిషి ఇవతలికొచ్చి...అరుగుపై నిలబడి....''ఎస్...'' అన్నాడు "ఏం కావాలి'' అన్న భావం ధ్వనించేట్టు.

అతను అప్పుడే తుడిచిన అద్దంలా తేటగా, తెల్లగా....నిర్మలంగా ఉన్నాడు. చూపులతోనే చచ్చిపోయిన మనిషిని బ్రతికించ గలడా ఇతను అన్నంతప్రశాంతత అతని కన్నుల్లో సముద్రంలా పొంగుతూంది.

"డాక్టర్ నరసింహంగారున్నారా" అన్నాడు రాజారావు.
"నేనే....మీరు..."

రాజారావు మనసు అప్పుడే అంటుకున్న అడవిలా అయింది.

''నేను రాజారావు నండీ."

"వో...మీరా...రండి, రండి...టామీ....గో" అన్నాడు. వెంటనే కుక్క దాని నోరు పడిపోయినట్టు మొరగడం మానేసి, తల వేళ్ళాడేసుకుని మాయబొమ్మలా లోపలికి వెళ్ళిపోయింది.

"నమస్కారం, డాక్టర్ గారూ." "నమస్తే .... రండి ...." లోపలికి తీసుకెళ్ళాడు.

"మీరు తప్పకుండా వస్తారని నాకు తెలుసు" అన్నాడు డాక్టర్. "రెండు వేల రూపాయలు వస్తుంటే రాకపోవడ మేమిటండీ ఎవరైనా"

"అవును...రండి....రండి." ఇంకో గదిలోకి తీసుకెళ్ళాడు.

ఆ గదిలో అప్పటికే ఒక నలుగురు వ్యక్తులున్నారు. ఒకతను టేబుల్ ముందర కూర్చున్నాడు కుర్చీ మీద. మిగతా ముగ్గురు అతనికి ఎదురుగా సోఫాపై కూర్చున్నారు తలలు వంచుకుని. వాతావరణం నిశ్శబ్దంగా...గంభీరంగా ఉంది.

రాజారావు సింహాలున్న గదుల్లోకి వచ్చినట్టుగా భయపడ్డాడు ఎందుకో. చెమటలు వరదలా ముంచు కొచ్చాయి.

"మీరు నా వెంట రండి" అని నరసింహం రాజారావును తన వెంట ప్రక్కనున్న గదిలోకి తీసుకెళ్ళాడు. ఆ గదిలో ఎవరూ లేరు. ఒక టేబుల్‌పై ఒకకొత్త సూట్‌కేస్ పెట్టి ఉంది.

డాక్టర్ నరసింహం ప్రక్కనున్న కుర్చీలో కూర్చుంటూ— "ఆ సూట్‌కేస్ మీదే చూచుకోండి'' అన్నాడు వినయంగా.

రాజారావు పంతులు ముఖంలోకి చూస్తున్న శిశుతరగతి కుర్రాడిలా బెరుగ్గా నరసింహం ముఖంలోకి చూచి—తెలిసి పాము బుట్టలో చేయి పెట్టబోతున్న వాడిలా సూట్‌కేస్ మూత తెరిచాడు.

లోపల డాక్టర్ నరసింహం ఉత్తరంలో రాసినట్టు రెండు జతల బట్టలుగానీ, రెండు నోట్ల కట్టలుగానీ లేవు. ఒక కాగితపు ముక్క మాత్రం ఉంది.

దాన్ని తీసుకుని, దానిమీద రాసి ఉన్న నాలుగు అక్షరాలను చదివాడు. అతనికి చచ్చిపోవాలన్నంత సిగ్గేసింది. తోకకు టపాకాయల

గుత్తిని తట్టి అంటించినప్పటి గాడిదలా తికమకపడి పిచ్చివాడై పోయాడు.

దీనంగా నరసింహం వంక చూశాడు—బిక్కపోయి.

"మీదేనా ఆ సూట్ కేస్?" అడిగాడు నరసింహం.

రాజారావు మాట్లాడలేదు.

"చెప్పండి" చిక్కిపోయిన దొంగలా నిస్పృహాయంగా చూస్తున్నాడు రాజారావు.

"రండి నా వెంట." యజమాని వెంట కుక్కలా నడుస్తున్నాడు తల వంచుకుని.

ఇంతకు ముందు నలుగురు వ్యక్తులున్న గదిలోకి వచ్చారు ఇద్దరూ.

"కూర్చోండి." ఇదివరకే కూర్చున్న ముగ్గురు మనుషుల పక్కన సీటు చూపించాడు. రాజారావు కూలబడిపోయాడు మంత్ర ముగ్ధుడిలా.

కూర్చున్న నలుగురినీ ఉద్దేశించి అన్నాడు డాక్టర్ నరసింహం— "బహుశా మీ అందరికీ సిగ్గనిపిస్తూందనుకుంటాను" అని.

నలుగురిలో ఎవరూ మాట్లాడలేదు. అందరి తలలూ వాలిపోయి ఉన్నాయి.

"బహుశా మీపై మీకే అసహ్యమేస్తూందనుకుంటాను ..." అన్నాడు మళ్ళీ. ఎవరినుండి జవాబు లేదు.

"ఇక్కడ నేను మీతో కొన్ని మాటలు మాట్లాడాలనుకుంటున్నాను. నేనూ, నా ప్రక్కనున్న డాక్టర్ మిత్రా—ఇద్దరమూ మానసిక వైద్యులం. 'మనిషి సంస్కారం ఆశాపరమైన బలహీనత' అన్న విషయంమీద ఒక ప్రయోగం చేయాలనుకున్నాం. ఆశ అనేది మనిషి సంస్కారాన్నీ, సామాజిక ఉనికినీ, ప్రతిష్టనూ అధిగమింపజేసి వీటికి అతీతమైన సుఖవాంఛాతత్పరత అన్న బలహీనతలోకి ఐంతిలా తన్నుతుంది. వానితో ఏ పనినైనా చేయిస్తుంది. మనిషిని వెఱ్ఱివాణ్ణి చేస్తుంది. ఈ సంగతిని ప్రయోగపూర్వకంగా నిరూపించుకునేందుకు మాకు కొందరు సంస్కారవంతులు కావలిసొచ్చారు. మేము మిమ్మల్ని ఎన్నుకున్నాం ఇందులో ఒకరు రచయిత, ఒకరు రాజకీయ నాయకుడు, ఒకరు విద్యార్థి, ఇంకొకరు రంగస్థల నటుడు. మీ అందరికీ తెలుసు పరధనాపహరణ పాపమని, నేరమని. రోడ్డుమీద మనం చూస్తూండగా ఒకమనిషి జేబులోనుండి వో పది రూపాయల నోటు జారి పడిందనుకోండి, వాణ్ణి పిలిచి, వాడి డబ్బువాడికివ్వడం సంస్కారం, నిజాయితీ. అలా చేయక ఎవరూ చూడకుండా చటుక్కున జేబులో వేసుకోవడం దుర్బుద్ధి. ఇది అతి సూక్ష్మమైన మానసిక లక్షణం. దీన్ని విశ్లేషించేందుకు వేర్వేరుగా మీకు నలుగురికి ఒకే రకమైన ఉత్తరాలు రాశాం. నిజానికి మీలో ఎవరి సూట్‌కేస్‌కానీ, ఎవరి డబ్బుకానీ పోలేదు. అసలు మేము రాసిన తేదీన మీరు రైల్లో ప్రయాణించారో లేదోకూడా మాకు తెలియదు. మీ సూట్‌కేస్ మాకు దొరికినట్టూ, దానిలో రెండు వేల రూపాయలున్నట్టూ, అవి మీకే చెందిన వైనట్టూరాసి, మీలో ఆశను రేపి, ఆ ఆశకు మిమ్మల్ని బానిసలను చేసి మిమ్మల్ని ఇక్కడికి రప్పించాం. తేరగా వస్తున్న సొమ్మును ఈ రకంగా స్వంతం చేసుకోవచ్చని ఎవరికి వారు మీ వ్యక్తిగత సంస్కారాన్ని విడిచిపెట్టి ఇక్కడికి వచ్చారు. తీరా సూట్‌కేస్‌ను

తెరిచి చూస్తే కనిపించింది "పోనీ నీ సూట్‌కేస్ కోసం నీది కాని డబ్బుకోసం ఎందుకీ ఆరాటం సిగ్గు లేదా" అన్న చీటీ. మనిషికి వ్యక్తిత్వం అవసరం. వ్యక్తిత్వ రాహిత్యంలోకి మనిషి దిగజారిన తరవాత మనిషిలో నుండి రాక్షసుడు మొలకెత్తుతాడు. సంస్కారాన్ని కోల్పోయిన తరవాత వ్యక్తి మానసికంగా వికృతమైపోతాడు. ఇప్పుడు మీరందరూ..."డాక్టర్ నరసింహం చెప్పుకుపోతున్నాడు గీతను బోధిస్తున్న శ్రీకృష్ణుడిలా.

నలుగురి తలలూ అలాగే వాలిపోయి ఉన్నాయి సిగ్గుతో.